

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అన్నయ్యకి ఫోన్** చేసి జరిగిన సంగతి చెప్పాను.

"కంగ్రాచ్యులేషన్స్. ఐ సో ప్రౌడ్ ఆఫ్‌యు" అన్నాడు.

"ఫస్ట్ సెమిస్టర్‌లో జాబ్ వచ్చింది నా ఒక్కదానికే అట. మిగిలిన వాళ్ళెవ్వరికీ రాలేదట" బడాయిపోయాను.

"నీకు తెలిసిన వాళ్ళల్లో ఎవరికీ రాలేదు" సరి చేసాడు.

"అంటే?" అయోమయంగా అడిగాను.

"నీ సర్కిల్‌లో అలాంటి వాళ్ళు లేరు. అంతే. ఫుల్ స్కాలర్ షిప్‌తో అడ్మిషన్ వచ్చినవాళ్ళు, అప్లై చెయ్యకపోయినా ప్రొఫెసర్‌లు అప్రోచ్ అయినవాళ్ళు, ఇద్దరు ప్రొఫెసర్లు ప్రాజెక్ట్ ఆఫర్ ఇచ్చిన వాళ్ళు చాలామందే ఉంటారు. అలాంటి వాళ్ళు నీ సర్కిల్‌లో లేరు. అంతే" అన్నాడు.

చెంప ఛెళ్ళున కొట్టినట్టు అనిపించి కోపంతో కళ్లల్లో నీరు తిరిగింది. రెండు క్షణాల నిశ్శబ్దం తరవాత ,

"నీ కన్నా తెలివిగలవాళ్ళు, కష్టపడేవాళ్ళు ఎంతో మంది ఉన్నారు. రేపు వాళ్ళే నీకు కాంపెటీషన్ అయ్యేది .ఫస్ట్ సెమిస్టర్‌లోనే ప్రొఫెసర్ దగ్గర ఉద్యోగం రావడం గొప్ప అని నాకూ తెలుసు. నాకు సెకండ్ సెమిస్టర్‌కి కానీ జాబ్ రాలేదు. లివింగ్ ఎక్స్‌పెన్సెస్ కూడా నాన్న పంపేవారు. ఐ రియల్లీ ఫ్రౌడ్ ఆఫ్‌యు. కానీ అప్పట్లో నేను వచ్చిన దాంతో తృప్తి పడి ఆగిపోయాను. నేను లైబ్రరీలో ఉద్యోగం చేస్తూ సంతోషిస్తే, మా క్లాస్‌లో ఉన్న ఒక రష్యన్ ప్రొఫెసర్‌ని వారానికి రెండుసార్లు కలిసి, పేపర్లు విచ్చలవిడిగా చదివి, తన ఫస్ట్ సెమిస్టర్ పూర్తయ్యేలోగా ఒక జర్నల్‌కి ఆర్టికల్ పంపాడు. లైబ్రరీలో జాబ్ వచ్చిందని తను రిలాక్స్ అవ్వలేదు. అందరూ స్నోలో ఆడుకుంటుంటే తను లైబ్రరీలో చదువుకునేవాడు. సమ్మర్‌లో రెండు జాబ్స్ చేసాడు. అప్పుడు ఎంతో కష్టపడ్డాడు. మేమందరం  చూసి పిచ్చనుకునేవాళ్ళం. ఇవాళ తను 'జి ఈ'లో నెట్ వర్క్స్ లో లీడర్ పొజిషన్‌లో ఉన్నాడు. నేను ఇండియాకి సంవత్సరానికి ఒక్కసారి వచ్చినట్టు తను రష్యాకి రెండుసార్లు వెళ్తాడు. నెట్‌వర్క్ మొత్తానికి మేనేజర్ కాబట్టి ఇటలీ, కెనడా, నైజీరియా, ఫ్రాన్స్, మొదలగు దేశాలన్నిటికీ కంపెనీ డబ్బుతో వెళ్ళివస్తాడు. ఆ రోజు నేను స్నోలో ఆడుకోకుండా చదువుకుని ఉంటే,  లైబ్రరీ ఉద్యోగంతో తృప్తి పడకుండా ప్రొఫెసర్‌తో పని చేసి ఉంటే, ఈ రోజు నేను ఇంకెక్కడో ఉండేవాడిని. ఆ రష్యన్ అబ్బాయికి ఫస్ట్ సెమిస్టర్‌లో ఆర్ ఏ పొజిషన్ రాలేదు. నీకు వచ్చింది. తనకన్నా ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అది వృధా చేసుకోకు. నీకన్నా ఎక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళతో స్నేహం చెయ్యి. వాళ్ళని చూసి నీకు ఇన్స్‌పిరేషన్ వస్తుంది. ఉన్నదాంతో సరిపెట్టుకోకు" అన్నాడు.

ఒక్కసారిగా నా కళ్ళు తెరుచుకున్నాయి. తిరిగి నా కాళ్ళు భూమి మీదకి వచ్చాయి.

"ఐం ప్రౌడ్ ఆఫ్‌యు. డోంట్ ఫర్గెట్" అన్నాడు.

"ఓకే" అన్నాను.

"కోపంగా ఉన్నావా?"

"లేదు. ఆలోచిస్తున్నా"

"ఏం ఆలోచిస్తున్నావు?"

"ఏమో?" ఏమనాలో అర్ధంకాలేదు.

"ఉన్న తెలివి కూడా పోయిందా నా లెక్చర్‌కి" నవ్వాడు.

"లేదు లేదు. అలా ఏం లేదు."

"సరే లే. నేను చెప్పింది బ్రైన్‌లో ఒక మూల ఉంచు. మర్చిపోకు. కానీ ఇప్పుడు సెలబ్రేట్ చేసుకో. ఇది అమెరికాలో నీ ఫస్ట్ అచీవ్‌మెంట్. ఎంజాయ్"

"సరే. థాంక్స్."

"ఏమైనా అవసరమైతే ఫోన్ చెయ్యి."

"సరే అయితే"

"ఓకే. బాయ్. కంగ్రాచ్యులేషన్స్ అగెయిన్."

"థాంక్స్" ఫోన్ పెట్టేసాక అన్నయ్య మాటలే నా మెదడులో కదిలాయి. అన్నయ్య చెప్పింది కరెక్టే. నాకన్నా తెలివి గలవాళ్ళు ఎంతో మంది ఉన్నారు. ముందే నేను ఏరోస్పేస్, అందులోనూ ఇంటర్నేషనల్. చాలా కష్టపడాలి. ఈ ఒక్క ఉద్యోగం వల్ల ఫ్యూచర్ సెటిల్ అవ్వదు. కాస్త బాధలోకి జారేలోపు వెన్నెల ఇంటికి వచ్చింది.

"కంగ్రాచ్యులేషన్సోయ్. జాబ్ వచ్చిందట కదా. హనీష చెప్పింది."

"థాంక్స్."

"ఉత్త థాంక్స్ సరిపోదురోయ్. పార్టీ ఇవ్వాలి."

"యా. ఇస్తా"

"మీ అన్నయ్యకి చెప్పావా?"

"యా చెప్పాను"

"ఇంటికొచ్చినప్పటినుంచి ఫోన్‌లోనే ఉంది" హనీష చెప్పింది.

"అన్నయ్యతోనా?" వెన్నెల అడిగింది.

"ఔను" బదులిచ్చాను.

"నిజంగా అన్నయ్యేనా?" ఏడిపించింది.

"ఔను."

"మాకు అబద్దాలు చెప్పక్కర్లేదులే. మేమేమీ మీ ఇంట్లో వాళ్ళకి చెప్పము" నవ్వింది.

"నిజంగా అన్నయ్యే" నవ్వే ప్రయత్నం చేసా.

"సరే. ఈసారికి నమ్ముతాలే" నా ఇబ్బంది కనిపెట్టింది.

"డిన్నర్‌కి బయటకి వెళ్దామా?" అడిగింది.

"యా. ఓకే."

"హనీష, నువ్వూ?" వెన్నెల అడిగింది.

"యా. నాకు ఓకే. ఓల్డ్ షికాగోకి వెళ్దాం" బదులిచ్చింది.

"నీకు ఓకేనా?" నన్ను అడిగింది.

"నేను ఎప్పుడు వెళ్ళలేదు" బదులిచ్చాను.

"పిజ్జా ఓకేనా?"

"యా. ఓకే"

"సరే. వెళ్దాం పదా. రెడీ అవ్వు"

"నేను రెడీనే"

"ఒక్క టూ మినిట్స్ ఇవ్వండి 'ఫ్రెష్' అవుతా" వెన్నెల గదిలోకి వెళ్ళింది.

అంతా కలిసి ఒక పదిహేను నిమిషాల్లో వెన్నెల కార్‌లో ఓల్డ్ షికాగోకి బయలుదేరాము. పది నిమిషాల్లోపే చేరుకున్నాం కూడా. ఒక లార్జ్ పిజ్జా షేర్ చేసుకుందామనుకున్నాము. తాగడానికి నేను నీళ్ళు, వెన్నెల డయిట్ కోక్, హనీష ఏపిల్ సైడర్ అడిగాము. వెంటనే హనీషని ఐడి చూపించమన్నారు.

"నన్ను అడగలేదే?" అతను వెళ్ళాక అడిగాను.

"తాగే వాళ్ళు చూపిస్తే చాలు" హనీష అంది.

"నువ్వు తాగుతున్నావా?" ఆశ్చర్యపోయాను.

"ఏపిల్ సైడర్ బీర్. చాలా బావుంటుంది. నువ్వు కూడా తీసుకుంటావా?"

"ఛీ. వద్దు" వెంటనే "సారీ, అలా అనలేదు" సిగ్గుపడ్డాను.

ఇద్దరూ నవ్వారు. "ఫరవాలేదు. మొన్నే వచ్చావుగా. ఇలానే ఉంటుంది. వన్‌మంత్ అయ్యాక మళ్ళీ ఇక్కడికే వద్దాం అప్పుడు మార్పు నీకే తెలుసుతంది" హనిష నవ్వింది.

"ఎన్ని మంత్స్ అయినా నేను తాగను."

"నువ్వు తాగుతావనట్లేదు. తాగేవాళ్ళమీద, వాళ్ళ పక్కన కూర్చోడం మీద్ అనీ ఒపీనియన్ మార్తుంది" మళ్ళీ నవ్వింది.

"నాకు దురభిప్రాయంలేదు" సముదాయించుకున్నాను.

ఇంతలో వెయిటర్ తాగడానికి గ్లాసులు తీసుకొచ్చాడు. హనీష గ్లాసులోంచి వెన్నెల ఒక రెండు గుక్కలు తాగింది. మళ్ళీ ఆశ్చర్యపోయాను.

"డ్రైవ్ చెయ్యగలుగుతావా? బెదిరిపోయి అడిగాను.

"నేనేమీ మూడు నాలుగు గ్లాసులు తాగట్లేదు లేమ్మా. డ్రైవ్ చెయ్యగలుగుతాను" ఎగతాళి చేసింది.

కొద్ది నిమిషాలు మొత్తం నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దానితో కూడుకున్న ఇబ్బంది. పిజ్జా వచ్చాక ముగ్గురం తలో స్లైస్ తీసుకున్నాము. ఇంత రుచికరమైన పిజ్జా ఇప్పటివరకు నేను ఎప్పుడూ తినలేదు. చాలా బావుంది" అన్నాను.

"ఇక్కడ చీజ్ నాకు చాలా ఇష్టం" హనీష అంది.

"ఇండియాలో పిజ్జా కుక్క రొట్టెలా ఉంటూంది. చీజ్ చాలా కొంచమే వేస్తారు" వెన్నెల అంది.

నేను, హనీష పెద్దగా నవ్వాము.

"కుక్క రొంట్టేంటి వెన్నీ" పగలపడి నవ్వింది హనీష.

"ఔను. నమిలి, నమిలి తినాలి. ఇక్కడ ఎంత స్మూత్‌గా ఉంటాయో."

అలా కొద్దిసేపు నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకున్నాం. ఆ తరవాత ఇంటికి వెనక్కి వస్తుండగా నా ఇంటర్వ్యూ గురించి, ప్రొఫెసర్, ఇంకా లాబ్ మేట్స్ గురించి మాలాడాం.

"టైం మానేజ్‌మెంట్ చాల్ ఆఇంపార్టెంట్. ఇక్కడ ఇండియాలోలా 9నుంచి 5 వరకు ఉండవు క్లాసెస్, కానీ చదువుకునేది చాలా ఉంటుంది. ప్లస్ నీకు రీసర్చ్ వర్క్ కూడా ఉంటుంది. ఫస్ట్ సెమిస్టర్ చాలా ఇంపార్టెంట్. నాకు తెలిసిన చాలామంది ఫస్ట్ సెమిస్టర్ తరవాత డిపార్ట్‌మెంట్ అది ఒక్కటి చెయ్యగలిగితే సగం పని అయిపోయినట్టే" వెన్నెల చెప్పింది.

ఈలోగా ఇల్లు చేరాము. కొద్దిసేపు మాట్లాడుకుని పడుకునేందుకు సిద్ధమయ్యాను. ఇప్పుడు నాకు ఉద్యోగం ఉంది. రేపటీనుంచి లాబ్‌లో పని చెయ్యాలి. కొత్త జనాలతో స్నేహం ఏర్పరుచుకోవాలి. ఆయన ఇచ్చిన జర్నల్ ఆర్టికల్స్‌ని అర్థం చేసుకోవాళి. క్లాసులు మొదలయ్యాక రోజూ చదవాలి. ఈలోగా రూం చూసుకోవాలి. సరైన దారిలో వెళుతున్నాను అన్న అనుభూతి కలిగింది. ఇంకా చాల్ ఆచెయ్యాలి. ఆ రష్యన్‌లాగా ఉండాలి. ఇలా ఆలోచిస్తుండగా హఠాత్తుగా ఒక ఆలోచన ఎదురైంది. 'ఇప్పుడు హోం సిక్‌నెస్ లేదూ అమ్మ, నాన్న గురించి ఏడవటంలేదు. అన్నయ్యకి రోజుకి వంద మెసేజెస్ కూడా పంపటంలేదు. హనీష, వెన్నెలలాంటి మంచి స్నేహితులవల్ల కాబోలు. మొత్తానికి ఇండియానా అలవాటై ఇండియా గుర్తుకు రావటం తగ్గింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story